AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

వైభవంగా అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర

2

2

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

ఘనంగా దసరా వేడుకలు

– వివరాలు 2వ పేజీలో..

3-10-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

శ్రీరాంసాగర్‌లోకి తగ్గిన వరద

అక్షరటుడే, బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం జలాశయంలోకి 2.60 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. రాష్ట్రంలో, ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి మొన్నటి వరకు ఐదు లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. వర్షాలు తగ్గడంతో ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో అధికారులు దిగువకు నీటి విడుదలను తగ్గించారు. ప్రస్తుతం 2.60 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 33 వరద గేట్లు ఎత్తి 1.25 లక్షల క్యూసెక్కులు గోదావరి లోకి వదులుతున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1088.5 అడుగుల (71.85టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4 వేలు, సరస్వతి కాలువకు 400, లక్ష్మి కాలువకు 150 క్యూసెక్కులు వదులుతున్నారు. మిషన్ భగీరథకు 231, ఆవిరి రూపంలో 616 క్యూసెక్కుల నీరు పోతోంది. మొత్తం 1,34,397 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదు అవుతోంది. ఔట్ ఫ్లో కంటే ఇన్‌ఫ్లో అధికంగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది.



నిజాంసాగర్‌కు కొనసాగుతున్న వరద..

అక్షరటుడే, ఎల్లారెడ్డి : నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తుతోంది. దీంతో శుక్రవారం 17 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 1,18,246 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అధికారులు వరద గేట్ల ద్వారా 1,25,740 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రధాన కాలువకు 900 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయంలో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 14.007 టీఎంసీల నీరు ఉంది. క్రమం తప్పకుండా జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో పరీవాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రిస్క్ చేసి వాగులను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఓ పోలీసు అధికారి అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నాడు. ప్రతీ కేసు నుంచి బలవంతపు వసూళ్లు చేయిస్తున్నాడు. దీంతో పలువురు బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై కమిషనరేట్ పోలీసు బాస్ గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

– అక్షరటుడే, నిజామాబాద్

పోలీసు అధికారి అడ్డగోలు వసూళ్లు..

▸ గుర్రుగా ఉన్న పోలీస్ బాస్ ▸ తీరు మారకపోతే వేటు తప్పదని హెచ్చరిక

ప్రమోషన్‌కు దగ్గరలో ఉన్న ఓ అధికారి.. అడ్డగోలు వసూళ్లకు పాల్పడడంపై పోలీసు అధికారుల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. శాంతి భద్రతల పర్యవేక్షణతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సీపీ సాయిచైతన్య పెద్దపీట వేస్తున్నారు. ఇదే సమయంలో అవినీతికి పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు పది మందికి పైగా సిబ్బందిపై ససస్పెన్షన్ వేటు వేశారు. అలాగే పలువురు అధికారులను సైతం బదిలీ చేశారు.

కానీ, కొందరు అధికారుల తీరులో మార్పు రాకపోవడంపై పోలీసు బాస్ గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ఇదే విషయమై తాజాగా సెట్ కాన్ఫరెన్స్‌లో ఆయన కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. 'ఓ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా ఉన్న అధికారి కానిస్టేబుల్ ద్వారా ప్రతీ కేసు నుంచి బలవంతపు వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయని, తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.' లేని పక్షంలో చర్యలు తప్పవనే హెచ్చరికలు జారీ చేశారు.

ఆది నుంచి అదే తీరు..

సదరు అధికారి అక్రమ వసూళ్లపై ఓ బాధితుడు ఐజీ కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదే సమయంలో స్టేషన్ పరిధిలో జరుగుతున్న వసూళ్ల దందాపై స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సైతం సీపీకి వివరించినట్లు తెలిసింది. కాగా.. పేకాట కేసులు, కేసుల్లో నిందితులకు ఇచ్చే స్టేషన్ బెయిల్ పేరిట కాస్తో కూస్తో ఇవ్వాల్సిందే అనే కండీషన్ పెట్టడం గమనార్హం.

సాధారణ పెట్టీ కేసుల నుంచి వసూళ్ల కోసం ప్రత్యేకంగా నియమించుకున్న ఓ కానిస్టేబుల్ ద్వారా వసూళ్ల పర్వం సాగించడం ఇందుకు నిదర్శనం. కాగా.. తీరు మార్చుకోని పక్షంలో అదును చూసి వేటు వేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

అంకాపూర్‌లో ఉత్సాహంగా అలయ్ బలయ్

అక్షరటుడే, ఆర్మూర్: మండలంలోని అంకాపూర్‌లో శుక్రవారం అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగగా.. గ్రామస్థులంతా ఒకరికొకరు అలయ్ బలయ్ చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ మార చంద్రమోహన్, మాజీ సర్పంచ్ కిషోర్ రెడ్డి, ఎంసీ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన సదస్సు

అక్షరటుడే, ఇందూరు: జన విజ్ఞాన వేదిక, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ అసోసియేషన్, మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7న అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు జన విజ్ఞాన వేదిక ప్రతినిధి నర్రా రామారావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సదస్సు జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం ఎదురుగా ఉన్న పెన్షనర్ భవనంలో ఉదయం 10:30కు కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి అవయవదాన ప్రచారకర్తలు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషిచేయాలి

అక్షరటుడే, ఇందల్వాయి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పిలుపునిచ్చారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ మండలాల్లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నందున.. బీజేపీ అభ్యర్థులు అలర్ట్‌గా ఉండాలన్నారు. ప్రతి కార్యకర్త అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ జిల్లాలో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర దిశ కమిటీ సభ్యుడు ప్రదీప్ రెడ్డి, పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కేపీ రెడ్డి, ఇందల్వాయి మండల అధ్యక్షుడు లోలం సత్యనారాయణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెగ తాగేశారు..

▸ ఉమ్మడి జిల్లాలో రూ.31 కోట్ల మద్యం అమ్మకాలు..

▸ గతేడాది కంటే రూ.5 కోట్లు ఎక్కువ..

దసరా పండుగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. విజయ దశమి వచ్చిదంటే ప్రజలు మద్యం, మాంసానికి ప్రాధాన్యత ఇస్తారు. ప్రతి ఇంట్లో మాంసాహారం వండుతారు. అలాగే మద్యం కూడా భారీగా కొనుగోలు చేస్తారు. ఈ ఏడాది పండుగ రోజు గాంధీ జయంతి రావడంతో ముందస్తుగానే కొనుగోలు చేసి జాగ్రత్త పడ్డారు. మూడు రోజుల్లో రూ.30 కోట్లకు పైగా మద్యాన్ని కొనుగోలు చేశారు. – అక్షరటుడే, ఇందూరు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 151 మద్యం దుకాణాలు, 28 బార్లు ఉన్నాయి. ఇందులో నిజామాబాద్‌లో 102, కామారెడ్డిలో 49 వైన్ షాపులు, నిజామాబాద్‌లో 20, కామారెడ్డిలో 8 బార్లు ఉన్నాయి. దసరా పండుగ రోజు గాంధీ జయంతి రావడంతో మద్యం దుకాణాలు మూసివేశారు. దీంతో పండుగకు ముందు మూడు రోజులు రూ.31 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సాధారణంగా తెలంగాణలో దసరాకు మద్యం డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. సెలవును దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లా వాసులు ముందస్తుగానే కొనుగోలు చేశారు. పండుగకు ముందు ఒక్కరోజులో సుమారు రూ.15 కోట్ల వరకు అమ్మకాలు జరిగాయి.

గత ఏడాదితో పోలిస్తే ఎక్కువే..

గతేడాదితో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు ఈసారి ఎక్కువగానే జరిగాయి. గతేడాది దసరాకు మూడు రోజుల్లో రూ.26 కోట్ల మద్యం విక్రయించగా.. ఈసారి రూ.31 కోట్లు విక్రయించారు. అంటే సుమారు రూ.5 కోట్ల లిక్కర్ అదనంగా తాగేశారు.

ధరలు పెరిగినా..

ఈ ఏడాది మద్యం ధరలు రెండుసార్లు పెరిగాయి. అయినా మద్యం ప్రియులు ఏమాత్రం వెనకాడకుండా జోరుగా తాగేశారు. ముఖ్యంగా ఈ సంవత్సరం బీర్ల కంటే ఎక్కువగా విస్కీ, వైన్ కొనుగోలు చేశారు. దసరా నాడు గాంధీ జయంతి సందర్భంగా దుకాణాలు బంద్ ఉండటంతో బీర్లను నిల్వ చేయడం ఇబ్బందికరమని విస్కీ వైపు మందుబాబులు మొగ్గు చూపారు.

వచ్చే దసరాకు కొత్త దుకాణాలు

రాష్ట్రంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మద్యం దుకాణాలకు టెండర్లను నిర్వహిస్తారు. అయితే ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల లైసెన్స్ గడువు నవంబర్ 30తో ముగియనుంది. డిసెంబరు 1 నుంచి టెండర్ల ప్రకారం నూతన వైన్ షాపులు తెరుచుకోనున్నాయి. ఇప్పటికే నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. దీంతో వచ్చే ఏడాది దసరాకు నూతన మద్యం దుకాణాలు రానున్నాయి.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: సీపీ

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పిలుపునిచ్చారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలోని మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రెసిడెన్సీ స్కూల్ మైదానంలో మోపాల్ పోలీసుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచే ఉద్దేశంతో పోటీలు ఏర్పాటు చేశారు. ఈ టోర్నీలో 13 గ్రామాల నుండి 13 టీంలు పాల్గొన్నాయి. నాలుగు రోజుల నుండి క్రికెట్ టోర్నీ జరుగుతోంది. పోటీల ముగింపు కార్యక్రమానికి కమిషనర్ సాయి చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. యువకులందరినీ ఒక్కచోట చేర్చి టోర్నీ నిర్వహించాలనే ఆలోచన చేయడంపై మోపాల్ పోలీసులను అభినందించారు. యువకులంతా ఉత్సాహంగా టోర్నీలో పాల్గొని, స్ఫూర్తిదాయక ప్రదర్శన చూపినందుకు అభినందించారు. ఇది కేవలం ఒక ఆట మాత్రమే కాదని.. యువతను నైతికంగా, శారీరకంగా, మానసికంగా బలంగా తీర్చిదిద్దే ఒక మంచి సాధనంగా కూడా భావించాలని స్పష్టం చేశారు. మన సమాజంలో యువత పెద్దఎత్తున మత్తుపదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారని.. ఇది ప్రమాదకరమని సీపీ స్పష్టం చేశారు. ఆ వ్యసనాలకు అలవాటుపడితే జీవితాన్ని పూర్తిగా నాశనం అవుతుందన్నారు.

యువత ఆరోగ్యంగా ఉంటూ.. మంచి ఆలోచనలతో దేశభవిష్యత్తుకు బాటలు చేయాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు సీపీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి, సౌత్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సురేష్ కుమార్, మోపాల్ పోలీస్ స్టేషన్ ఎస్సై సుస్మిత, యువకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే: ఎమ్మెల్యే కేవీఆర్

అక్షరటుడే, కామారెడ్డి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమేనని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు ఆధ్వర్యంలో నాలుగు అసెంబ్లీల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పార్టీకి సేవ చేస్తున్న కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అయ్యే అవకాశం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉంటుందని, అవకాశం ఉన్న ప్రతి బీజేపీ కార్యకర్త స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారు.

ఒకవేళ రిజర్వేషన్ కారణంగా పోటీచేసే అవకాశం లేని వారు గెలిపించే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో ఉంటూ కేంద్ర ప్రభుత్వ పథకాలను, బీజేపీ సిద్ధాంతాలను, నరేంద్ర మోదీ సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండి బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

భక్తిశ్రద్ధలతో దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర

అక్షరటుడే, బోధన్/కోటగిరి : నవరాత్రులు పూజలందుకున్న దుర్గామాత నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలో సార్వజనిక్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిమజ్జన శోభాయాత్ర జరిగింది. సబ్ కలెక్టర్ వికాస్ మహతోయాత్రను ప్రారంభించారు. యాత్రలో భాగంగా మహిళలు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. మహిళలు మంగళహారతులతో అమ్మవారి ముందు నడిచారు. ఈ సందర్భంగా పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. శోభాయాత్ర ఆసాంతం పోలీసులు నిఘా నీడలో కొనసాగింది. ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట్ నారాయణ, వంద మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు శోభాయాత్రను పోలీసులు పర్యవేక్షించారు. అలాగే పోతంగల్ మండల కేంద్రంలో అమ్మవారి విగ్రహ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.

పోతంగల్ మండల కేంద్రంలో..

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన ముప్కాల్ విద్యార్థులు

అక్షరటుడే, ముప్కాల్ : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి పురస్కరించుకొని హైదరాబాద్‌లో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ 'ప్రతిభ పాటవ' పరీక్షలో ఎం.నితిన్, ఎండీ. రేహనొద్దీన్ పాల్గొని 50/50 మార్కులు సాధించి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ముప్కాల్ పాఠశాల రాష్ట్రస్థాయిలో పేరు వచ్చిందని పాఠశాల హెచ్ ఎం గంగారాం తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుండి దాదాపు 1,710 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఎంపీ అనిల్ కుమార్, ఎమ్మెల్యే కాల్వ సుజాత, మాజీ జీహెచ్ఎంసీ మేయర్ బి.రామ్మోహన్, ఫౌండేషన్ ఛైర్మన్ రాజేందర్ చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.5వేల నగదు బహుమతి, మెమెంటో, సర్టిఫికెట్లు, ఖాదీ వస్త్రాలు అందజేశారు. విద్యార్థుల విజయానికి గైడ్ టీచర్‌గా సుద్దపల్లి మల్లేశ్ మార్గనిర్దేశం చేశారు.

కామారెడ్డిలో కత్తిపోట్ల కలకలం..

ఐదుగురికి గాయాలు

అక్షరటుడే, కామారెడ్డి : కామారెడ్డి పట్టణంలో గురువారం అర్ధరాత్రి కత్తిపోట్లు కలకలం రేపాయి. పది రోజుల పాటు ప్రశాంతంగా సాగిన నవరాత్రి ఉత్సవాలు కత్తిపోట్లతో ఒక్కసారిగా ఉద్రిక్తతకు దారి తీశాయి. కామారెడ్డి పట్టణ సెంటర్ పాయింట్ అయిన పాత బస్టాండ్ ఏరియాలో ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. పాత బస్టాండ్ ప్రాంతంలో దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం అమ్మవారికి ఉద్వాసన పలికిన అనంతరం పలు చోట్ల దాండియా ఆడారు. దాండియా వద్ద రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలో రెండు గ్రూపులకు చెందిన యువకులు మద్యం మత్తులో ఒకరిపై ఒకరు పరస్పరం దాడి చేసుకున్నారు. కొందరు యువకులు వెంట తెచ్చుకున్న కత్తులతో దాడికి పాల్పడడంతో ఉద్రిక్తత చేసుకుంది. దాడిలో ఐదుగురు యువకులకు మెడ, పొట్ట, వీపు భాగాలలో గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రులను రాహుల్, మణిరాజు, మణికంఠం, కిరణ్, బాలాజీలుగా గుర్తించారు. జీజీహెచ్ ఎదుట మళ్లీ రెండు గ్రూపుల మధ్య గొడవ జరగడంతో పోలీసులు చెదరగొట్టారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోతంగల్ మండలంలో రావణ దహన కార్యక్రమం

అంబరమంటిన దసరా సంబురం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో దసరా సంబురాలు అంబరాన్నంటాయి. పండుగ సందర్భంగా గురువారం ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ జమ్మి చెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం ఒకరికొకరు శమీ ఆకులు (బంగారం) పంచుతూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. విజయదశమి సంద ర్భంగా రావణ దహన కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలిచాయి. బోధన్ పట్టణంలోని రామ్‌లీలా మైదానంతో పాటు పలుచోట్ల రావణ దహన కార్యక్రమాలను నిర్వహించారు. నిజామాబాద్ కమిషనరేట్‌తో పాటు, కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఆయుధ పూజ చేశారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



బిచ్కుంద మండల కేంద్రంలో..

ఆర్మూర్ పట్టణంలో..

ఎల్లారెడ్డి మండలంలో..

నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమలలో సినీ నిర్మాత దిల్‌రాజు ఆధ్వర్యంలో..

నగరంలోని సీపీ కార్యాలయంలో ఆయుధ పూజ చేస్తున్న సీపీ సాయిచైతన్య

ఆర్మూర్‌లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి..

వేల్పూర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి..

కామారెడ్డిలో ఎస్పీ రాజేష్ చంద్ర..

ఆర్మూర్‌లో..

భీమ్‌గల్ మండల కేంద్రంలో..

పోతంగల్ మండల కేంద్రంలో..

ఇందల్వాయిలో..

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

సాలూరలో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ్ కార్యకర్తలు

కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

అక్షరటుడే, బోధన్ : సాలూర మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందూరు ధర్మ జాగరణ కార్యకర్త సాయిరాం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925 సెప్టెంబర్ 27వ తేదీన విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్‌ను హెడ్గేవార్ ప్రారంభించారన్నారు. ఆనాడు హెడ్గేవార్‌తో సహా.. ఎంతో మంది ప్రముఖులు వ్యయ ప్రయాసలకు ఓర్చి సంస్థను ముందుకు నడిపిస్తూ వచ్చారన్నారు. ఆర్ఎస్ఎస్ ముఖ్య ఉద్దేశం వ్యక్తిత్వ నిర్మాణమని వివరించారు. వ్యక్తి నిర్మాణంతోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లె సాయన్న, ఇల్తెం శంకర్, రాజు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

అక్షరటుడే, ముప్కాల్: ముప్కాల్ గ్రామానికి చెందిన గాండ్ల పోసాని అనారోగ్యంతో ఇటీవల చికిత్స పొందింది. అనంతరం ఆమె సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు శుక్రవారం మంజూరైన చెక్‌ను బాధితురాలికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముస్కు మోహన్, ఏలేటి రాములు, మల్లారెడ్డి, సందీప్, మహిపాల్ పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

అక్షరటుడే, కామారెడ్డి: మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి న్యాయస్థానం జరిమానా విధించింది. ఇందులో ఒకరికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలుశిక్ష విధించింది. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాలతో ఇటీవల పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తనిఖీలు చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేస్తున్నట్లు గుర్తించారు. వారిని న్యాయస్థానం ఎదుట హాజరుపర్చారు. దీంట్లో భాగంగా న్యాయమూర్తి ఒకరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిం చారు. అలాగే దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరికి రూ.3వేల జరిమానా వేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణానికి ప్రమాదమన్నారు. వాహనం నడిపే వారికి మాత్రమే కాకుండా ఇతరులకు కూడా ప్రమాదమని తెలిపారు. వాహనదారులు కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

ఘనంగా గాంధీ జయంతి

గాంధీ జయంతిని ఉమ్మడి జిల్లాలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం సీపీ కార్యాలయంలో సీపీ సాయిచైతన్య గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గాంధీజీ బోధించిన అహింసా మార్గం.. సత్యాగ్రహ సూత్రాలు సమాజానికి ప్రేరణనిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏసీపీ బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కామారెడ్డిలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాజేష్ చంద్ర గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కామారెడ్డి డివిజన్ ఏఎస్పీ చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు. – అక్షరటుడే, నిజామాబాద్ సిటీ/కామారెడ్డి